'గాయత్రీ రామాయణం'గా ప్రసిద్ధి చెందుతాయి. శ్రద్ధగా వినండి!'' అంటూ చెప్పసాగారు నారద మహర్షి

• • •

శ్లో. ''తపస్స్వాధ్యాయ నిరతం, తపస్వీవాగ్విదాంవరం
నారదం పరిపప్రచ్ఛ, వాల్మీకి ర్మునిపుంగవమ్!!''

''ఓం భూర్భువః స్వః
తత్సవితుర్వరేణ్యం
భర్గో దేవస్య ధీమహి ధియో
యోనః ప్రచోదయాత్!''

పవిత్ర నైమిశారణ్యం గాయత్రీ మంత్రోచ్చాటనతో నినదిస్తున్నది. అక్కడ నివసిస్తున్న శౌనకాది మహామునులు లోకహితార్థం చేస్తున్న యజ్ఞయాగాలతో పరిసరాలలో ప్రశాంతత నెలకొనివున్నది. ఆ భక్తిపూరిత వాతావరణంలోకి ప్రవేశించారు నారాయణ స్మరణ చేస్తూ నారద మునీంద్రులు. వారిని చూడగానే సగౌరవంగా, సాదరంగా ఆహ్వానించారు మునిబృందం. భారద్వాజ మునీంద్రులు చూపిన ఆసనం అలంకరించి ''ఈ పవిత్ర వాతావరణంలోకి రావడంతో నా మనస్సు ప్రఫుల్లమైంది. మీరు చేస్తున్న గాయత్రీ మంత్రోపాసన మహిమ అటువంటిది మరి!'' అన్నారు నారదమహర్షి చిరునవ్వుతో!

''మహర్షీ! మహిమాన్వితమైన గాయత్రీ మంత్రోపాసన చేస్తున్న మాకు అందుకు సంబంధించిన విషయాలు మరికొన్ని మీ ద్వారా వినాలని వుత్సుకతగా వున్నది. మీ వాగామృతంతో మమ్మల్ని ధన్యులను చేయండి!'' మునులందరూ ముక్తకంఠంతో ప్రార్థించటంతో చిన్నగా తలపంకించి చెప్పసాగారు నారదమహర్షి!

''శౌనకాది మునులారా! మీరిలా అడగటంతో ఇరవై నాలుగు బీజాక్షరాలతో కూడిన ఈ మంత్రాధారంగా పూర్వం వాల్మీకి రచించిన రామాయణం గూర్చి మీకు చెప్పాలన్న సంకల్పం జనించింది నాలో! పరమ పవిత్రమైన రామాయణ గాథ గాయత్రీ రామాయణం! గూర్చి చెబుతాను వినండి!'' అంటూ ఆగి అందరివైపు ఒక్కసారి పరిశీలనగా చూసారు. అందరి ముఖాలలో కుతూహలం తొంగి చూస్తున్నది.

''శౌనకాది మునులారా! వాల్మీకి మహర్షి రచించిన రామాయణానికి మూలాధారం గాయత్రీ మంత్రమే సుమా! వాల్మీకి రామాయణాన్ని ఇరవై నాలుగు వేల శ్లోకాలలో పొందు పరిచాడు. గాయత్రీ మంత్రంలో ఒక్కొక్క బీజాక్షరం ఆధారంగా వేయి శ్లోకాలు రచించాడు. ఆ శ్లోకాలలో ఆయన మహత్త్వపూర్ణమైన వుపదేశసారం నింపి లోకానికి అందించాడు. మీరందరూ వాల్మీకి రామాయణాన్ని పారాయణ చేసినప్పుడు లోతుగా ఆలోచించి చూడండి. నా మాటల్లోని అంతరార్థం బోధపడుతుంది. అయితే అంతటి ఉద్గ్రంథాన్ని పారాయణ చేసిన జ్ఞానులు ఆ సారాంశాన్ని గ్రహించగలరు కానీ సామాన్య జనాలకు గాయత్రీ రామాయణం పూర్తిగా చదివి అర్థం చేసుకోవడం కష్టమే. అందుకే ఇప్పుడు మీరు అడిగారు గనక గాయత్రీ మంత్రంలోని ఇరవై నాలుగు బీజాక్షరాలతో కూడిన శ్లోకాలు ఇరవై నాలుగు చెబుతాను. నిత్యం ఆ శ్లోకాలను పారాయణ చేసేవారికి పూర్తిగా రామాయణం పారాయణ చేసినంతటి పుణ్యం లభిస్తుంది. అతి మహిమాన్వితమైన ఈ ఇరవైనాలుగు శ్లోకాలే



# గాయత్రీ రామాయణము

# అవతారిక

- డా. టి. కళ్యాణీసచ్చిదానందం

తా. శౌనకాది మనులారా! ఈ శ్లోకంలో వాల్మీకి మహర్షి నన్ను (నారదుని) తపోధనునిగా, వేదాధ్యాయన పరునిగా, వాఙ్మయవేత్తలలో అగ్రేసరునిగా గౌరవిస్తూ, రామచరితంలోని విశేషాలు తెలుపమంటూ ప్రశ్నించాడు. పెద్దలపై ఎనలేని గౌరవాభిమానాలు కలిగి వుండాలని వెల్లడి చేస్తున్నాయి ఆ పలుకులు!

శ్లో. ''సహత్వా రాక్షసాన్ సర్వాన్. యజ్ఞఘ్నాన్ రఘునందనః!
ఋషిభిః పూజితస్సమ్యగ్యంధేంద్రో విజయీపురా!!''

తా. రాముని వీరత్వాన్ని వెల్లడిస్తున్నది ఈ శ్లోకం. విశ్వామిత్ర ముని యాగ రక్షణార్థం రాక్షసులను పరిమార్చిన రాముని ఋషులంతా దేవతలు ఇంద్రుని కొలిచే విధంగా ప్రస్తుతించి కొలిచారు. వీరులను కొనియాడి, గౌరవించడం సాంప్రదాయం కదా!

శ్లో. ''విశ్వామిత్ర స్సధర్మాత్మా శ్రుత్వా జనక భాషితమ్!
వత్స! రామ ధనుఃపశ్య ఇతి రాఘవ మబ్రవీత్!!''

తా. విశ్వామిత్రునితో రామలక్ష్మణులు సీతా స్వయంవర సభకు వెళతారు. సభలో ఎవరూ శివధనుర్భంగం చేయలేకపోవడంతో జనక మహారాజు ఆందోళన చెందుతాడు. అది గమనించి విశ్వామిత్రుడు ''వత్సా! రామ! ఆ ధనుస్సును చూడు'' అంటూ అనుజ్ఞనిస్తాడు. శివధనుర్భంగం అవలీలగా చేయగల సమర్థుడైన శ్రీరాముడు గురువాజ్ఞకోసం ఎదురు చూస్తున్నాడని స్పష్టమౌతున్నది గదా! గురుభక్తి కలిగిన వివేకవంతులను విజయలక్ష్మి తప్పకవరిస్తుంది మరి!



శ్లో. ''తుష్టావాస్య తదావంశం, ప్రవిశస్య సవిశాంపత్!
శయనీయం నరేంద్రస్య తదాసాద్య వ్యతిష్ఠత!!''

తా. ఈశ్లోకంలో ప్రశంసయొక్క మహత్వం తెలుపబడింది. కైకేయి కోరిన వరాలతో కకావికలైన హృదయంతో పరితపిస్తున్న దశరథునికి మంత్రి సుమంత్రుడు ధైర్యం చెబుతూ ఆడితప్పని ఇక్ష్వాకువంశంని ప్రశంసిస్తాడు. ఆ పలుకులతో తేరుకున్న రాజు తను కైకేయికిచ్చిన మాట నిలబెట్టుకోవడం అనివార్యమని గ్రహిస్తాడు. సత్ప్రశంసకు పాత్రం కావడానికి ఎట్టి పరిక్షనైనా తట్టుకోగల సామర్థ్యం కలిగివుండటం అవసరం!

శ్లో. ''వన వాసంహి సంఖ్యాయ వాసాంస్యా భరణానిచ!
భర్తార మనుగచ్ఛంత్యై సీతాయైశ్వశురోదదౌ!!''

తా. వనవాస దినాలను లెక్కపెట్టుకుంటూ భర్తతో పయనమౌతున్న సీతకు మామగారైన దశరథుడు వస్త్రభూషణాలు ఇచ్చాడు. వనవాస కాలంలో ఆమెకేలోటూ రాకూడదన్న వాత్సల్య భావం వ్యక్తమౌతున్నది పైశ్లోకంలో!

శ్లో.''రాజా సత్యంచ ధర్మశ్చ, రాజాకులవతాంకులమ్!
రాజామాతా పితాచైవ రాజాహిత కరోన్నృణామ్!!''

తా. మహారాజు యొక్క గుణాలు వర్ణింపబడ్డాయి పైశ్లోకంలో! సత్య, ధర్మ ప్రవర్తనుడైన రాజు ప్రజలకు తానే తల్లీ, తండ్రివంటి వాడు. ఆ రాజు పాలనలో ప్రజలు శాంతి, సౌభాగ్యాలతో జీవిస్తారు. అందుకే రామరాజ్యం అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచిపోయింది.

శ్లో. ''నిరీక్ష్య సుముహూర్తంతు దదర్శ భరతోగురుమ్!
ఉటజే రామమాసీనం, జటావల్కల ధారిణమ్!!''

తా. ఈ శ్లోకంలో భక్తునికి భగవంతుని దర్శనం ఎక్కడ, ఏవిధంగా కలుగుతుందో గూఢంగా చెప్పబడింది. వనవాసానికి తరలిన శ్రీరాముని జటావల్కలధారిలా పర్ణశాలలో దర్శించాడు భరతుడు! మహారాజులా ఐశ్వర్యభోగాలలో అంతఃపురంలో లభించే దర్శనం కన్నా, నిరాడంబరంగా త్యాగానికి ప్రతీకగా వున్న ఈరూపం అతని హృదయానికి శాంతిని ప్రసాదిస్తుంది. అందుకే వివేకవంతుడైన భక్తుడు నిర్మలమైన అంతరంగమే భగవంతునికి వాసయోగ్యమైన కుటీరంగా గ్రహించి, జ్ఞాననేత్రంతో అందులో వసించే ఆ ఆత్మారాముని దర్శించటానికి ప్రయత్నించాలి!

శ్లో. ''యది బుద్ధిః కృతాద్రష్టు మగస్త్యంతం మహామునిమ్!
అద్యైవగమనే బుద్ధిం, రోచయస్వ మహామతే!!''

తా. భరతుడు పాదుకలు తీసుకు వెళ్ళిన తర్వాత శ్రీరాముడు అగస్త్యముని దర్శనం చేసుకోవాలనుకుంటాడు. అప్పుడు వనంలోని ఋషులు ''ఓ మహామతీ శ్రీరామా! నీవు అగస్త్యదర్శనాభిలాషివైతే ఆలస్యం చేయక నేడే ప్రయాణమై వెళ్లు!'' అని చెబుతారు. 'అగస్త్య' మంటే కళ్యాణార్థం అని మరో అర్థం వున్నది. లోకకళ్యాణార్థం మహత్తర కార్యసాధనకు పూనుకోవడానికి వర్తమానాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఊరికే కాలాన్ని వృథా చేయరాదన్నది గూఢార్థం!


శ్లో. ''భరతస్సార్య పుత్రస్య శ్వశ్రూణాం మమచప్రభో!
మృగరూపమిదం వ్యక్త విస్మయం జనయిష్యతి!!''

తా. అగస్త్యముని ఆశీర్వాదంపొంది పంచవటిలో కాలంగడుపుతున్న సీతారాముల ముందు నడయాడుతూ కనబడుతుంది కనకమృగం! ఆ లేడిని చూసి విస్మయపడుతూ సీత రామునితో ''ఈ దివ్యమృగం మిమ్మల్ని, భరతుని, అత్తలను క్రీడావస్తువుగా ఆనందపరుస్తుంది. దాని చర్మం ఎంతో మృదువుగా, సుందరంగా వున్నది. సజీవంగా పట్టుబడకపోతే వేటాడి దాని చర్మమైనా తేవలసింది'' అని కోరుతుంది. ప్రతి మనిషి తనకు ఆనందాన్ని కలిగించే వస్తువు సంపూర్ణంగా లభించకపోతే కనీసం ఎంత లభ్యమైందో దానితో తృప్తి చెందటం నేర్చుకోవాలన్నది గూఢార్థం!

శ్లో. ''గచ్ఛ శీఘ్రమితోరామ సుగ్రీవం తం మహాబలం
వయస్యం తం కురుక్షిప్రమితో గత్వాద్య రాఘవ!''

తా. సీతాపహరణం తర్వాత ఆమెను వెదుకుతూ వెళుతున్న రాముడు కబంధుడనే రాక్షసుడి బాహువులు ఛేదించి శాపవిముక్తి కలిగిస్తాడు. గంధర్వ రూపం పొందిన

## మీకు తెలుసా?




ఆలిండియాకే సోలో అంద గాడు బాబూ మోహన్ నటు డిగా మనంద రికీ తెలిసిందే. అయితే ఇటీ వల ఆయన గాయకుడుగా కూడా మారా డండోయ్.

ఆదిత్యా మ్యూజిక్ ద్వారా 'అల్లుడుగోల- అత్తింటి లీల' అనే కేసెట్ విడుదల చేశారు. ఏడు పాట లున్న ఈ కేసెట్ విరివిగా అమ్ముడుపోతోందట. స్వయంకృషితో నటుడిగా పైకివచ్చిన బాబూమో హన్ ఇప్పుడు అదే కృషితో గాయకుడిగా కూడా అయ్యాడు. తనకంటూ ఎంతోమంది అభిమా నుల్ని సంపాదించుకున్న బాబూమోహన్ మరింత పాపులర్ కానున్నారు. ఏదిఏమైన ఒకే వ్యక్తి నాయకు డిగా, గాయకుడిగా, నటుడిగా ఆయనకి మంచి ఫ్యూచరే ఉంది. ఆల్ ది బెస్ట్.

### కాశీ ఎమ్.ఎస్.నారాయణ

నాగేశ్వరరావు డైరెక్షన్‌లో సాయిరత్నం నిర్మిస్తున్న శివన్న చిత్రంలో విలన్ కాశీగా నటిస్తున్నాను. నా లైఫ్‌లో మంచి టర్నింగ్ పాయింట్ ఇది. విభిన్న తరహాలతో కూడిన మంచి క్యారెక్టర్ ఇది. రకరకాల మంచి, చెడ్డ పనులు చేసే టిపికల్ క్యారెక్టర్ కూడా. నాకెంతో మంచిపేరు తెచ్చిపెడుతుంది. మరి మీరూ చూస్తారు కదూ.

- విరాజి




కబంధుడు ''ఓ రాఘవా! నీవు శీఘ్రమే వానరుడైన సుగ్రీవుని కలుసుకుని మిత్రునిగా చేసుకోవలసినది!'' అని చెబుతాడు. బలవంతుడైన మిత్రుని అవశ్యకతను తెలియజేస్తుంది పై శ్లోకం. జీవికి బలవంతుడైన స్నేహి తుడు లభించేది ఆధ్యాత్మికధ్యానంలోనే! భక్తి అనే మిత్రుని ద్వారా మోక్షానికి మార్గం సుగమమౌతుంద న్నది గూఢార్థం!

శ్లో. ''దేశకాలో ప్రతీక్షస్వ క్షమమాణః ప్రియా ప్రియే!
సుఖః దుఃఖ సహఃకాలే సుగ్రీవ వశగో భవ!''

తా. రామునిచే వధింపబడిన వాలి తన కుమారుడైన అంగదునితో 'దేశకాలానుసారం ప్రియాప్రియాలను, సుఖదుఃఖాలను సమంగా సహించి సుగ్రీవుని అధీ నంలో వుండమని!' హితవు చెబుతాడు. ఎటువంటి సమయంలోనైనా మనస్సు ఎప్పుడూ ఒకే సమస్థితిలో వుండాలన్నది గూఢార్థం!

శ్లో. ''వంద్యాస్తేతు తపస్సిద్ధా స్తపసానీత కల్మషాః!
ప్రష్టవ్యాచాపి సీతాయాః ప్రవృత్తిర్వినయాన్వితైః!!''

తా. సీతాన్వేషణకు నాలుగు దిక్కులకు వెళుతున్న వానరులకు రాముడు 'నిష్పాపులు, సిద్ధపురుషులు, తపస్వులు ఎదురైతే వారికి నమస్కరించి వినయంగా సీత సమాచారం గూర్చి అడగవలసింది!' అని చెబు తాడు. ఆత్మజ్ఞానియైన గురువు లక్షణాలు, శిష్యులు ప్రవర్తించాల్సిన తీరు సూచింపబడ్డాయి ఆ మాటల్లో!

శ్లో. ''సనిర్జిత్య పురీం శ్రేష్టాం లంకాంతాం కామరూపి ణిమ్!
విక్రమేణ మహాతేజా హనుమాన్ కపిసత్తమః!!''

తా. హనుమంతుడు సముద్రాన్ని దాటి లంకను చేరుతాడు. కామరూపిణియైన లంకిణి రక్షలో నిర్భే ద్యంగా వుంటుంది లంకాపురి. అందులో నివసించే అసురులు కామవాంఛలకులోనై పాపాచారులై జీవిస్తు న్నారు. వారిని జయించాలంటే ముందుగా లంకిణి మాయను జయించాలి. పరాక్రమం, బ్రహ్మచర్య, ఆత్మసంయమనంకల హనుమంతుడు అవలీలగా లంకిణిని జయించగలిగాడు. జ్ఞానులైన వారు కామ మనే మాయను జయించడానికి ఎప్పుడూ కృషి చేయాలి.

''ధన్యాః దేవా స్సగంధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః!
మమ పశ్యంతి యేనాధం రామం రాజీవలోచ నమ్!''

తా. రాజీవలోచను డైన శ్రీరాముని సంద ర్శించే వారందరూ ధన్యులు. దేవతలు, గంధర్వులు, సిద్ధులు, పరమఋషు లందరూ జ్ఞాననే త్రంతో రాముని దర్శింపగలుగుతు న్నారు. కానీ రావ ణుని వంటి అధర్మప రులు, మాయామో హితులు రాముని వునికి తెలుసుకోలేకపోతున్నారు. సామాన్యుడి గా భావించి, శత్రుత్వం వహిస్తున్నారు. భగవంతుని దర్శిం చడానికి, అర్థం చేసుకోవడానికి నిర్మలమైన అంతః కరణం ఎంత అవసరమో బోధించబడింది పై శ్లోకంలో!

శ్లో. ''మంగళాభి ముఖీతస్య సాతదాసీన్మహాకపే!
ఉపతస్థే విశాలాక్షీ ప్రయతాహవ్యవాహనమ్!!''

తా. కపిశ్రేష్ఠుడైన హనుమంతునికి మంగళాలు చేకూ ర్చమని విశాలనేత్రాలు గల సీతాదేవి అగ్నిభట్టారకుని ప్రార్థిస్తున్నది. అగ్నిదేవుని ఆరాధించడంవల్ల శుభాలు సమకూడుతాయన్నది వైదిక సాంప్రదాయం! జీవనశ క్తికి అగ్ని ఆధారం. ఆ శక్తికలవారికి అన్ని మంగళాలు సమకూడుతాయి. అందుకే అగ్ని సహాయంతో తేజరి ల్లుతూ హనుమంతుడు మాతకార్యాన్ని జయప్రదంగా నిర్వహించగలిగాడు.

శ్లో. ''హితం మహార్థం మృదుహేతు సంహితం,
అతీత కాలాయతి
సంప్రతిక్షతుమ్! నిశమ్య యద్వాక్య ముపస్థిత జ్వరః
ప్రసంగవా నుత్తర మేతదబ్రవీత్!''

తా. రామునిపై యుద్ధసన్నాహాలు ప్రారంభించిన రావణునికి తమ్ముడు విభీషణుడు చెప్పిన హితోక్తులు నచ్చవు. కోపం కలిగిస్తాయి. విభీషణునీ దూషించి బహిష్కరిస్తారు. అహంకారం, స్వార్థం గూడుకట్టు కున్న రావణుని మనస్సు ఉచితానుచితానుగ్రహించే వివేకం కోల్పోతుంది. మదోన్మత్తులు పరులు చెప్పే హిత వచనాలు గ్రహించలేరు. పైగా కోపంగా వారినే దూషిస్తారన్నది గూఢార్థం!

శ్లో. ''ధర్మాత్మా రాక్షసాం శ్రేష్ఠః సంప్రాప్తోయం విభీ షణః
లంకైశ్వర్యం ధ్రువం శ్రీమానయమాప్నోత్య కంట కమ్!''

తా. తనను శరణుకోరి వస్తున్న విభీషణుని చూసి రాముడు రాక్షస శ్రేష్ఠుడైన విభీషణుడు శత్రుహీనమై, కంటకరహితమైన లంకను పాలించగలడు! అని తన వారితో చెబుతాడు. ధర్మాత్ములై, నిష్పక్షపాతులై ప్రజల హితంకోరే రాజుకు శత్రుభయం వుండదని, వారు సర్వులకూ ఆదరపాత్రులు కాగలరనీ సూచింపబ డింది.

శ్లో. ''యోవజ్ర పాతాగ్ని సన్నిపాతాన్న చక్షుభేనాపి
చచాలరాజా! సరామ బాణాభిహతో భృశార్తశ్చచాల
చాపంచముమోచ వీరః!!''

తా. తనవారందరూ యుద్ధంలో మరణించగా రావ ణుడు స్వయంగా యుద్ధానికి తరలివస్తాడు. అతడు వజ్రపాతానికి గానీ, అగ్నిప్రహారానికి గానీ చలించనటు వంటి వీరుడు. కానీ రామబాణాల తాకిడికి దుఃఖించి, క్షీణిస్తున్న ధైర్యాన్ని అదుపులోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

మహా సాహసవంతులైనా అహంకారపూరితులై అధ ర్మానికి పాల్పడే వారిని భగవంతుడు ఏదో ఒకనాడు దండించక మానడు. వారి దుష్కర్మలకు తప్పక ఫలితం అనుభవిస్తారన్నది గూఢార్థం!

శ్లో. ''యస్య విక్రమ మాసాద్య రాక్షసానిధనం గతః!
తం మన్యేరాఘవం వీరం నారాయణ మనామ

యమ్!!''

తా. రావణుని సంహరించి రాముడు శాంతిని చేకూరుస్తాడు! ''ఎవని పరాక్రమం వల్ల రాక్షసులందరూ వధింపబడ్డారో, అట్టి నిష్కల్మషవీరుడైన శ్రీరాముడు ధన్యుడు!'' అంటూ వినుతిస్తారు దేవతలు.

వీరత్వ, పరాక్రమాల శ్రేష్ఠత తెలుపబడింది పైశ్లోకంలో! స్వార్ధ చింతనలేకుండా పరోపకారార్థం పరాక్రమాన్ని ప్రదర్శించేవారు అహంకారానికి ఎన్నడూ లోను కారన్నది విశేషార్థం!

శ్లో. ''నతే దదృశిరే రామం దహంతమరి వాహినీమ్!
మోహితాః పరమాస్త్రేణ గాంధర్వేణ మహాత్మనా!!''

తా. రాముడు తన దివ్య గాంధర్వాస్త్రాలతో రాక్షసులను మోహితులను చేసాడు. అందుచేత వారు తమ సైన్యాన్ని నాశనం చేస్తున్న రాముడిని చూడనే లేకపోయారు. తమ అజ్ఞానమే తమ వినాశనానికి కారణమన్న విషయం వారు గుర్తించలేదు అన్నది గూఢార్థం! భగవంతుడు అదృశ్యంగా వుండి మానవులు చేసే పాపకృత్యాలనే అస్త్రాలుగా సంధించి వారిని నశింప చేస్తాడని గుర్తుంచుకోవాలి.

శ్లో. ''ప్రణమ్య దేవతాభ్యశ్చ బ్రాహ్మణే భ్యశ్చమైథిలీ!
బద్ధాంజలి పుటాచేద మువాచాగ్ని సమీపతః!!''

తా. అగ్నిప్రవేశం చేసే ముందు సీత చేతులు జోడించిముందుగా దేవ బ్రాహ్మణులకు నమస్కరిస్తుంది. తరువాత అగ్నిదేవుడిని ప్రార్థిస్తుంది తన పాతివ్రత్యానికి సాక్ష్యం చెప్పమని!

అగ్నిసాక్షిగా మన అంతఃకరణంలో వసించే జ్యోతి రూపుడైన భగవంతుని ధ్యానించి చెప్పేమాట సత్యమై తీరుతుంది. మోసం, కపటం, అసత్యం అనేవి అటువంటి హృదయాలలో అడుగిడనే లేవు.

శ్లో. ''చలనాత్పర్వతేంద్రస్య, గణాదేవాశ్చ కంపితాః!
చచాల పార్వతీ చాపి తదాశ్లిష్టామహేశ్వరమ్!!''

తా. సీతాదేవి అగ్నిప్రవేశం చేయడంతో అందరూ హాహాకారాలు చేస్తుండగా కులపర్వతాలు, చివరకు హిమవత్పర్వతం కూడా చలించడంతో పార్వతీదేవి తడబాటుతో పరమశివుని కౌగిలించుకున్నది.

ఆధారం చలిస్తే దానిమీద వున్న సమస్తం చలించిపోతుంది. సత్యమే భూమికాధారం, అందుకే సీత అగ్నిప్రవేశం చేయడంతో లోకాలు క్షోభించాయి. సత్య నిరూపణలో ఎంతైనా సంక్షోభం కలగవచ్చుకానీ అందుకు పూనుకున్నవారు మాత్రం భీతి చెందరన్నది గూఢార్థం!

శ్లో. ''దారాః పుత్రాః పురంరాష్ట్రం, భోగాచ్ఛాదన భోజనమ్!
సర్వమే వావిభక్తంనో భవిష్యతి హరీశ్వర!''

తా. స్త్రీ, పుత్ర, నగర, రాష్ట్ర, భోగ, వస్త్ర, భోజనాదులన్నీ అవిభక్త సంపత్తిగా అనుభవించాలని తెలుపుతున్నది పై శ్లోకం!

భగవంతుడు ప్రసాదించిన సమస్త వస్తు సముదాయంపై మానవులందరికీ సమానాధికారం వున్నది. ఆవశ్యకతను బట్టి అర్హత గలవారందరూ అనుభవార్హులేననీ, సంపత్తి ఒకరివ్యక్తిగత అధీనం కాదనే సమాజవాదసిద్ధాంతం నిరూపిస్తున్నది స్థూలంగా!

''యామేవ రాత్రిం శత్రుఘ్నః పర్ణశాలాం సమావిశత్!
తామేవ రాత్రిం సీతాపి ప్రసూతా దారకద్వయమ్!''

తా. శత్రుఘ్నుడు వాల్మీకి ఆశ్రమంలో ప్రవేశించిన నాటి రాత్రే సీత ఇద్దరు పుత్రులను ప్రసవించినది. లవణాసురుని జయించడానికి బయలుదేరిన శత్రుఘ్నుడిలో వాల్మీకి ఆశ్రమంలో ప్రవేశించగానే ఆత్మజ్ఞానం వికసిస్తుంది. ఆత్మోన్నతికి అవసరమైన జ్ఞానమూ, మార్గమూ అతనికి గోచరిస్తాయి. సీతపుత్రుల రూపంలో అతను దర్శించింది వాటినే! అప్పుడు కలిగే దివ్యానుభూతే గాయత్రీమంత్ర సిద్ధి అన్న సందేశం నిక్షిప్తమైంది ఈ చివరి శ్లోకంలో!

• • •

ఫలశ్రుతి

''శౌనకాది మునులారా! ఎన్నిసార్లు విన్నా తనివితీరని రామాయణం విన్నమీరు, చెప్పిన నేనుకూడ ధన్యులమే! గాయత్రీ రామాయణంలో ఆధ్యాత్మికచింతన, తత్వబోధ, సామాజిక ప్రయోజనం నిబిడీకృతమైవున్నాయి. గాయత్రీమంత్రంలోని ఇరవైనాలుగు బీజాక్షరయుక్తములైన పైశ్లోకాలను శుచిర్భూతులై గురుధ్యానం చేసి పారాయణ చేసేవారికి సకల సౌభాగ్యాలూ సిద్ధిస్తాయి. సంపూర్ణంగా రామాయణం పారాయణ చేసిన పుణ్యం లభిస్తుంది.

అదుగో చూడండి! వసంతకోకిల కుహూరావాలతో ప్రకృతి ఎంత సుందరంగా చైతన్యకాంతులు విరజిమ్ముతున్నదో! చైత్రశుద్ధపాడ్యమితో వసంత నవరాత్రులు ప్రారంభమయ్యాయి. నవమి పునర్వసు నక్షత్రంతో కూడిన పరమపర్వదినం! శ్రీరామనవమిగా ఆ పూర్ణపురుషుని జన్మోత్సవం, కళ్యాణం, పట్టాభిషేకం కొరకు నియమితమైన పుణ్యదినం! అందరం కలిసి సమస్త మానవాళికి సర్వశుభాలొసగమని ఆ కౌసల్యాతనయుడిని, సీతామనోభిరాముడిని, పట్టాభిరాముడిని ప్రార్థిద్దాం!

''శ్రీరామ చంద్రః శ్రిత పారిజాతః, సమస్త కళ్యాణ గుణాభిరామః!
సీతాముఖాంభోరుహ చంచరీకః! నిరంతరం మంగళమాతనోతుః!''

నారదమౌని శ్రావ్యంగా గానం చేస్తుంటే మునులందరూ భక్తితో పులకించిపోతూ గొంతు కలుపుతారు. పవిత్ర నైమిశారణ్యం శ్రీరామగానంతో పునీతమౌతుంది!

సర్వేజనా సుఖినోభవంతు ఓం శాంతిః శాంతిః శాంతిః

★

# అయితే...



''ఈనవల మీ సొంతమేనా?''
''మీకు మలయాళం వచ్చా?''
''రాదు''
''అయితే నా సొంతమే!''

# గౌరవం

''మా అత్తగారంటే నాకు అపరిమితమైన గౌరవం. నెలకోసారైనా...''
''కొత్తచీర కొని పెడుతుంటావా?''
''కాదు. ఓల్డేజ్‌హోం కెళ్ళి ఆమెని చూసొస్తుంటా!''

- **భానుకిరణ్** (సీతాఫల్‌మండి)

# గొప్ప

''ఏమిట్రా నానీ! నువ్వు హోంవర్క్ చెయ్యలేదని బెత్తంతో ఒకచేతిమీద తంతే మరో చెయ్యికూడా చూపిస్తున్నావేంటి?'' అడిగారు మాస్టారు.
''గాంధీగారిని ఒక చెంపమీద కొడితే ఇంకో చెంప చూపించారని మీరే చెప్పారు కదా మాస్టారు. మరి నేను గాంధీగారంత గొప్పవాడినని మీకు తెలియాలి కదా.'' చెప్పాడు నానీ.

# మార్పు

మంత్రిగారిని ఇంటర్వ్యూ చేస్తున్నాడు విలేఖరి.
విలేఖరి: అప్పటి కాలానికి ఇప్పటి కాలానికి మధ్య జరుగుతున్న పరిస్థితులలో మార్పు ఏమిటి?
మంత్రిగారు: ఏముందీ, అప్పటికాలంలో నేను జేబులు కత్తిరించేవాడ్ని. ఇప్పుడు ఓపెనింగులకి రిబ్బన్లు కత్తిరిస్తున్నాను. అంతే తేడా.

- **చలపాక ప్రకాష్** (విజయవాడ)

